## అమ్మమ్మ ఇక్కడకి వచ్చుంటే...! - SKU

Back Home

ఈ పేజీని పంపండి

అమ్మమ్మ పోయి మూడేళ్ళు కావస్తోంది. దురదృష్టవశాత్తూ తను పోయినప్పుడు దగ్గర లేను, తన సంవత్సరీకాలకి కూడా వెళ్ళటానికి అవకుండా ఇక్కడ వుండిపోయాను. మనిషిని ఇక్కడ వున్నా ఆలోచనలు మాత్రం అమ్మమ్మ గురించే. అమ్మమ్మ వున్నన్నాళ్ళూ తనని చాలా తేలిగ్గా తీసుకున్నాను. మా చుట్టాలలో అంతా అమ్మమ్మ అంటే హడలిపోయేవారు కానీ మాకు మాత్రం అమ్మమ్మ గురించి అలాంటి హడలు లేదు సరికదా, తను ఏమన్నా చెప్పినా తేలిగ్గా, ఒకోసారి చిరాగ్గా కొట్టిపారేసిన రోజులు గుర్తు వచ్చి, తెలీకండానే మనసు బాధపడుతుంది. అమ్మమ్మ వుండి వుంటే చెప్పేదాన్ని, నువ్వు వున్ననాళ్ళూ నీ ప్రభావం నా మీద ఎంత వుందో చెప్పలేకపోయాను, కానీ పైనుండి నువ్వు గమనిస్తూనే వుండి వుంటావు నా జీవితాన్ని మలచిన స్త్రీ మూర్తులలో నువ్వూ వున్నావు అని!

అమ్మమ్మని ఇక్కడకి తీసుకురావాలని పెద్దగా అనుకోలేదు. దానికి కారణం నేను ఇక్కడకి వచ్చేసరికే అమ్మమ్మ వయసు పెద్దది అయిపోయింది, తనలో కూడా శక్తి సన్నగిల్లింది. ఆమె మనసు మాత్రం ఉత్సాహం గా వున్నా తనకీ తెలుసు తన శరీరం కెనడా ని తట్టుకోలేదు అని. అంత వరకూ ఎందుకూ మా నాన్నగారికి కూడా ఇక్కడకి రావటానికి అదే సంకోచం. నేను అక్కడకి వచ్చి ఆ చలిలో వుండలేనమ్మా అని! విచిత్రం ఏమిటంటే, నాన్నగారి చిరకాల వాంఛ మంచు లో ఆడుకోవాలని. మంచు అంటే మన ఇండియా లో పడే తెల్లారగట్ట మంచు కాదు, స్నో. నేను ఎప్పుడన్నా ఇక్కడ స్నో పడుతోంది అని చెప్పినప్పుడల్లా ఇంతకు ముందు అడిగినవే అయినా అవే ప్రశ్నలు అడుగుతారు.. మంచు ఎలా పడుతుంది, అలా సినిమాల్లో చూపించినట్టు దూదిపింజల మాదిరి మంచు మీకు కూడా పడుతుందా? వగైరా.

అమ్మమ్మని అన్నీ బాగుండి ఇక్కడకి తీసుకువచ్చినా తను ఇక్కడి జీవనపరిస్థితులని చూసి ఏ విధంగా రియాక్ట్ అవుతుంది అని ఒకోసారి ఆలోచిస్తూవుంటాను. అంటే, అమ్మమ్మ తన జీవితకాలం అంత ఎక్కడా రాజీ పడకుండా ఎక్కడా కాదు, లేదు అనే మాట వినకుండా (మా మనవలం దానికి మినహాయింపు లెండి!) బతికింది. అలాంటిది ఇక్కడ తన తరహా కి వేరే గా వున్న ఇక్కడి జీవిత విధానం కి ఏమవుతుందీ అని ఆలోచించకుండా వుండలేను.

ఎంతోకొంత కల్చర్ షాక్ దేశం మారాక ఎవరికైనా తప్పదు. కానీ చిన్న చిన్న విషయాల్లో "Dilwale Dulhaniya Le Jayenge" లో షారుఖ్ ఖాన్ చెప్పినట్టు "Bade Bade Deshon me eisi choti choti baten hoti rahti hain senorita" అని మనసు కి సర్దిచెప్పుకుని బతికేస్తాం. మరి సర్దుకోక చస్తామా? కొత్తల్లో ఏవో అలవాటు లేనప్పుడు తింగరిగా ప్రవర్తించినా, నాలుగైదు ఏళ్ళు గడిచేసరికి బతుకంతా ఇక్కడే బతినట్టు, ఇండియా లోని పద్ధతులు అన్నీ అనాగరికమం అన్నట్టూ కూడా కొండకచో ప్రవర్తిస్తాము.

నా మటుకు నాకు ఇక్కడ మామూలే కాని వింతగా అనిపించిన విషయాలు.. దోసలు వేసిన పెనం ని కాగితం పెట్టి తుడిచేసి, మళ్ళీ తరువాత సారి దోశలు వేసినప్పుడు వాడటం. మా ఇంట్లో మంచినీళ్ళు తాగిన గ్లాసు ని కూడా స్నానం చేసాక పాచి గ్లాసు అని ముట్టుకోనిచ్చేది కాదు అమ్మమ్మ. అలాంటిది ఇక్కడ నేను ప్రస్తుతం దోశలు వేసి ఆ పెనం ని కాగితం పెట్టి తుడిచేసి, ఓవెన్ కింద వున్న సొరంగం లో తోసేయటం చూస్తే, మళ్ళీ మర్నాడు నా ఇంట్లో వచ్చి మంచినీళ్ళు

ముట్టదు.. అది ఖాయం!

కెనడా లో వున్నప్పుడు నేను ఇంట్లో కుర్చీలు, డైనింగ్ టేబుల్ కొనటానికి సంకోచించి, కేవలం ఒక ఫుటాన్ బెడ్ నే సోఫా లాగ, ఎవరన్నా ఇంటికి వచ్చినప్పుడు గెస్ట్ పడుకొనే మంచం లా వాడుతూ వుండేదాన్ని. అమెరికా వచ్చాక అదీ లేదు. అత్యవసరమైన వస్తువులు తప్ప ఏమీ లేవు ఇక్కడ. తిండీ, టీవీ చూడటం అంతా నా కంప్యూటర్ డస్క్ దగ్గరే. ఆ కంప్యూటర్ డస్క్ మీద దాదాపు నా మెడికల్ కిట్ నుండి, నా జ్యూవెలరీ కిట్ వరకు ఎంతో కొంత కనిపిస్తాయి.

నాకు అస్సలు శుచీ శుభ్రం లేదు అని అనేసుకుంటున్నారు కదూ? నాకూ వస్తాయండీ హార్ట్ ఎటాక్ తరహా నీట్ నెస్ ఎటాక్ లు అప్పుడప్పుడు. అవి వచ్చినప్పుడు ఇల్లు మొత్తం (అంటే నా కంప్యూటర్ డస్క్) ని మొన్న వచ్చిన "My Big Fat Greek Wedding" చిత్రం లో కథానాయిక తండ్రి మాదిరి Windex వేసి మరీ తుడిచి పారేస్తూ వుంటాను తళతళా మెరిసేటట్టు. మరి ఆ ఎటాక్ ల మధ్య మాత్రం నా డస్క్ కొంచెం "సిండు" గా వుంటూ వుంటుంది. మరి అమ్మమ్మ ఇక్కడకి వస్తే, నాకూ రోజూ ఈ ఎటాక్ లు రావాలంటే కష్టం. అలాంటప్పుడు, నా సిండు కుండ వైపు లో వున్న డస్క్ ని చూస్తే, అమ్మమ్మ నన్ను ఇంక ముట్టుకోను కూడా ముట్టుకోదేమో! ఆమెవి అన్నీ చాదస్తాలు, పాత ఆచారాలు అని కొట్టి పారేసినా, ఆ ఆచారాలలో శుభ్రం కూడా వుంది అని కన్వీనియంట్ గా ఒకోసారి మర్చిపోతూ వుంటాను.

ఇక్కడ అమ్మమ్మ గురించీ, మా ఇంట్లో ఆచారం గురించీ చిన్న ఉపన్యాసం ఇవ్వాలి. ఇంట్లో అంట్లూ, శోట్లూ మహా దిట్టం గా పాటించే వారు. అన్నం, కూరలూ, పులుసులూ వగైరా అంట్లూ, పచ్చళ్ళూ, మజ్జిగా నెయ్యీ తదితరులు శోంట్లూ. (ఇదెక్కడి మాట అనుకుంటున్నారా? ఏదో ప్రాస కోసం అంటు కి వ్యతిరేకం అనే అర్థం లో వాడిపారేసా సర్దుకోండి) అంటు ని ముట్టుకుంటే, పక్కన పెట్టుకున్న మంచి నీటి ని చేతి మీద ఒంపుకొని శుద్ధి చేసుకోవాలి. అది జరగకుండా శొంట్లు ముట్టుకుంటే అవి కూడ అంట్లు అయిపోతాయి. మా స్కూల్ ఫ్రెండ్ అరుణా వాళ్ళ నానమ్మ గారు ఓ సారి నేను వాళ్ళింట్లో భోజనం చేస్తూ ఈ మాటి మాటి కీ మంచి నీటి తో చెయ్యి కడుక్కోవటం పేరు చెప్పి టేబుల్ అంతా నీళ్ళు ఒంపేస్తుంటే అన్నారు.. మజ్జిగ న్యూట్రల్.. దానికి అంటు వుండదూ అని. కానీ అమ్మమ్మ దగ్గర ఈ శాస్త్రం పని చెయ్యలేదు, అది వేరే విషయం!

ఇంక నా దేవుడు. "మా కెనడా" తరహా లో "నా దేవుడు" ఏమిటా అనుకుంటున్నారా? అదే, మా ఇంట్లో రోజూ నేను పూజ చేసే దేవుడు విగ్రహాలూ, పటాలు అన్నమాట! కాకినాడ లో అయితే, దేవుడికి ప్రత్యేకం ఒక గది వుండేది. అది లేనప్పుడు కనీసం ఒక మందిరం లా వుంచి దానిలో దేవుడిని పెట్టాం. ఆ ప్రత్యేక మందిరం కి తలుపులు వుంటే, అది వేరే గది లో వున్నా దానికంటూ దానికి ఒక గది వున్నట్టు అని ఒకసారి మా అమ్మమ్మ చెప్పింది. ఈ ఎరేంజ్ మెంట్ కి కారణం ఇంట్లో ఆడాళ్ళు బయట చేరినప్పుడు దేవుడి మందిరం వైపు రాకూడాదు, ఏమీ చేయకూడదు. ఇరుకిళ్ళలో వుండే మధ్యతరగతి వారికి దేవుడికంటూ ప్రత్యేకం ఒక గది కేటాయించటం అవదు కనుక, ఇలా మందిరం ఏర్పాటు. మరి ఇక్కడ నాకు ఆ మందిరం కూడా లేదు. కేవలం నా వీడియో కేసెట్లు పెట్టుకునే అలమారా పైన ఈ దేవుళ్ళ పటాలు, విగ్రహాలు పెట్టి, రోజూ, లేక గుర్తు వున్న రోజుల్లో ఆయనకి ఒక అగరొత్తి వెలిగించి తిప్పేసి, ప్రసాదం బిళ్ళలు మూడు (ఇదేం లెక్క అని మళ్ళీ ఆశ్చర్యపోతున్నారా? అదేంటో, రోజు కళ్ళు మూసుకొని తీసినా పేకట్లోంచి నా చేతికి మూడంటే మూడే ప్రసాదం బిళ్ళలు వస్తాయి! నాకు అక్కడ వున్నది మూడు విగ్రహాలు.. ఆ లెక్క అయి

వుంటుంది!) అక్కడ పెట్టేసి, ఒక దణ్ణం పెట్టేసి, ఆ ప్రసాదం బిళ్ళలు కాఫీ లో కలిపేసుకొని తాగేయటం.. కనీసం నా దేవుళ్ళకి ఆ ప్రసాదం బిళ్ళలు రుచి అయినా చూసే అవకాశం ఇవ్వకుండా!

మరి నా ఈ పూజా తతంగం చూస్తే అమ్మమ్మ గుండెలు బాదుకునేది. ముందు దేవుడ్ని ఏ దిక్కులో పెట్టానో తెలీదు. అసలు నాకు ఏ దిక్కు ఏటు పైపు వుందో confusion లేకుండా తెలిస్తే కదా! ఒకవేళ సూర్యభగవానుడు రావటం బట్టి ఏ దిక్కు ఏదో తెలిసినా, ఏ దిక్కున ఏది వుంచాలో ఎన్ని సార్లు తెలుసుకున్నా నిర్లక్ష్యం దానితో ఆచరించే శ్రద్ధ లేదు. ఇలా ఎదో నాకు వీలు వున్నపైపు దేవుడ్ని పెట్టడం సుతారామూ అమ్మమ్మ కి.

ఇంక ఇక్కడా, కెనడా లోనూ నేను వున్న దాదాపు అన్ని ఇళ్ళల్లో బయట నుండి రావటం రావటం వంటింట్లోకి రావటం, వంటింటి దగ్గర చెప్పులు విడిచే ప్రదేశం వుండటం, నా వాష్ రూమ్ నేనే కడుక్కోవలసి రావటం, పాలు కాగితం డబ్బా లో వారానికి ఒకసారి కొనుక్కోవటం ఇలా ఒక్కటా .. అడుగడుగునా తనని ఖంగారు పెట్టే విషయాలే. ఇన్ని షాకులకి అమ్మమ్మ ని ఇక్కడకి తీసుకువచ్చి వుంటే తను తట్టుకోగలిగేది కాదు అని అమ్మమ్మ ని ఇక్కడకి తీసుకురాకుండా మంచి పనే చేసాను అని మనసు కి సర్దిచెప్పుకోవటం.

ఏమో, అమ్మమ్మ మంచి ఉద్దండురాలు, ఎక్కడ వున్నా అక్కడి పరిస్థితులని తన పద్ధతికి మార్చగల పట్టుదల మనిషి. తను ఇక్కడకి వచ్చి వుంటే, తను ఇక్కడి పద్ధతులకి అలావాటు అవటం కన్నా తన పద్ధతులు ఇక్కడ కూడా ఎలా పాటించవచ్చో నాకు చూపించ గలిగి వుండేది ఏమో కూడా!

---

మీ సలహాలు, సూచనలు, అభిప్రాయాలు రచయిత్రి SKU కి తెలియపరచండి.
మీ అభిప్రాయాలు రచ్చబండ లో తెలియచేయండి